94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21




త్వరలో మీముందుకు రానున్న
'ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుల కాంటాక్ట్ బుక్‌లెట్'
రాజధాని వార్తలు ప్రత్యేక సంచిక ఫోన్ : 9440662699


# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU


కేవలం 1000 రూపాయలకే



విజయవాడ బందర్ రోడ్డులో ఆధునిక సౌకర్యాలతో ఏసి మీటింగ్ హాలు ఏర్పాటు చేయడం జరిగింది. కేవలం 1000 రూపాయలకే ఇందులో 60 మందితో సమావేశాలు జరుపుకోవచ్చును.
ఫోన్: 94406 62699



అమరావతి సంపుటి : 4 సంచిక : 50, పేజీలు 4, వెల: రూ. 2.00 | ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక | సోమవారం 16 - ఆదివారం 22 సెప్టెంబర్, 2019

Amaravati Volume : 4 Issue : 50, Pages 4, Rate : 2.00 | ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY | Monday 16- Sunday 22 September, 2019


వివరాలు2లో...



డిసెంబర్లో మున్సి'పోల్స్'!

వివరాలు3లో...



ఇంజనీర్స్ దినోత్సవం సందర్భంగా

వివరాలు3లో...



కృత్రిమ కాళ్ల చిన్నారి మోడల్..

వివరాలు4లో...



గుజరాత్ కసాయికి అవార్డా ?

## ఏపీ బీసీ కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ అంబటి శంకర నారాయణ



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ఏర్పాటు చేసిన శాశ్వత బీసీ కమిషన్ చైర్మన్‌గా ఉమ్మడి హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర నారాయణ నియమితులు కానున్నారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించిన తర్వాత ప్రభుత్వం ఈమేరకు నిర్ణయం తీసుకుంది.

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం




**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి పదవీ స్వీకార ప్రమాణం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 11 గంటలకు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఐదేళ్ల పాటు లక్ష్మణ్‌రెడ్డి ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అవినీతి నిరోధానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏపీ ప్రభుత్వం లోకాయుక్తగా జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి గతంలో ఏపీ ఉమ్మడి హైకోర్టు జడ్జిగా పనిచేశారు. లోకాయుక్త నియామకంతో పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం కానున్నాయి.

## రాజధానిలో తవ్వేకొద్దీ 'ఇన్‌సైడర్' బాగోతాలు

- వెలుగుచూస్తున్న టీడీపీ నేతల భూకొనుగోళ్లు



- రాజధాని ప్రకటనకు ముందే పచ్చకోటరి పాగా

**రాజధాని వార్తలు, అమరావతి :** రాజధానిలో తవ్వే కొద్దీ టీడీపీ నేతల ఇన్‌సైడర్ ట్రేడింగ్ బాగోతాలు మరిన్ని వెలుగుచూస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం నూతన రాజధాని గురించి అధికారికంగా ప్రకటించకముందే చంద్రబాబు తన టీమ్‌కు లీకులు ఇవ్వడంతో పచ్చ కోటరీ అమరావతి ప్రాంతంలో భారీగా భూకొనుగోళ్లు జరిపినట్లు తెలుస్తోంది. టీడీపీ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్‌కుమార్ జూన్ 6, 2014న తాడికొండలో 7 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు సమాచారం. అక్టోబర్ 31, 2014న నేలపాడులోని సర్వే నంబర్ 59లో టీడీపీ నేత నిమ్మకాయల చిన్నరాజప్ప తన కుమారుడు రంగనాథ్ పేరుతో రెండు ఎకరాలు కొనుగోలు చేసినట్టు సమాచారం. ఎకరం 7 లక్షలకు కొని కోటి రూపాయలకు చినరాజప్ప అమ్మినట్లు తెలుస్తోంది. గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మరో మూడు గ్రామాల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా భూకొనుగోళ్లు బయటపడ్డాయి. కొండంరాజుపాలెంలో సర్వే నెంబర్ 23/బీ1లో అక్టోబర్10, 2014న ఎకరం భూమి, కొండంరాజుపాలెంలో సర్వే నెంబర్ 51/డీలో అక్టోబర్ 10, 2014న ఎకరం 4సెంట్లు, కొండంరాజుపాలెంలో సర్వే నెంబర్ 63/ఏలో

- మిగతా 2 లో

# గోదావరిలో బోటు మునక

**రాజధాని వార్తలు, తూర్పుగోదావరి :** జిల్లాలోని దేవిపట్నం మండలం కచ్చులూరు సమీపంలో పర్యాటక బోటు బోల్తా పడింది. ప్రమాదం జరిగినప్పుడు బోటులో... సిబ్బందితో కలిసి 71 మంది పర్యాటకులు ఉన్నట్లు సమాచారం. 27 మందిని స్థానికులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వీరంతా గండిపోచమ్మ నుంచి పాపికొండలు టూర్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. పర్యాటకుల్లో చాలా మంది లైఫ్ జాకెట్లు ధరించినట్లు తెలుస్తోంది. గోదావరి వరద ఉధ్ధృతి తగ్గడంతో పర్యాటకానికి అధికారులు అనుమతి ఇచ్చారు. లైఫ్ జాకెట్లు ధరించిన కొంత మంది ఒడ్డుకు చేరినట్లు స్థానికులు చెప్పారు. కాగా ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించింది. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.





ప్రమాద ఘటనపై మంత్రి అవంతి ఆరాపడవ ప్రమాద ఘటనపై పర్యాటక మంత్రి అవంతి శ్రీనివాసరావు ఆరా తీశారు. జిల్లా ఉన్నతాధికారులు, పర్యాటక శాఖ అధికారులతో ఫోన్ చేసి ఘటనకు సంభంధించిన విషయాలు అడిగితెలుసుకున్నారు. పర్యాటకులను రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి హుటాహుటిన సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు.

**కంట్రోల్ రూం ఏర్పాటు**

దేవిపట్నం లాంచీ ప్రమాదం నేపథ్యంలో విశాఖ జిల్లా పర్యాటకుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. విశాఖ జిల్లా నుంచి పాపికొండల టూర్‌కి ఎవరైనా వెళ్లి ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 180042500002 కి వివరాలు తెలపాలని వారి కుటుంబ సభ్యులకి కలెక్టర్ వినయ్ చంద్ విజ్ఞప్తి చేశారు.

**రాయల్ వశిష్టకు అనుమతి లేదు...**

గోదావరిలో ప్రమాదానికి గురైన బోటు (లాంచీ)కు పర్యాటక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. రాయల్ వశిష్ట బోటును ప్రయివేట్ వ్యక్తి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోడిగుడ్ల వెంకట రమణ అనే వ్యక్తి ఈ బోటును తిప్పుతున్నట్లు చెప్పారు. మరోవైపు బాధితులను రక్షించేందుకు పర్యాటక శాఖ హుటాహుటీన రంగంలోకి దిగింది.

**సహాయక చర్యలకు రంగంలోకి దిగిన హెలికాప్టర్**

ఇందుకోసం టూరిజం విభాగం నుంచి రెండు బోట్లను సంఘటనా స్థలానికి పంపించారు. అలాగే సహాయక చర్యల కోసం మంత్రి అవంతి...విశాఖ నేవీ అధికారులతో మాట్లాడారు. నేవీ హెలికాప్టర్‌తో పాటు అధునాతన బోట్లను ఘటనా స్థలానికి పంపించాలని కోరారు. లాంచీ మునకకు వరద ఉధృతే కారణమని తెలుస్తోంది. గతంలో కూడా ఇదే ప్రాంతంలో రెండు ప్రమాదాలు జరిగినట్లు సమాచారం. ఉదయభాస్కర్, ఝాన్సీరాణి అనే బోట్లు ప్రమాదానికి గురై అనేకమంత్రి ప్రాణాలు కోల్పోయారు.


**సహాయక చర్యలకు హోంమంత్రి ఆదేశం**

అలాగే బోటు ప్రమాదంపై హోంమంత్రి

- మిగతా 2 లో

## మంగళగిరిలో ఎయిమ్స్






**రాజధాని వార్తలు, మంగళగిరి :** కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఎఐఐయంఎస్ నిర్మాణం మలిదశ పూర్తి 2020లో జరుగుతుందని మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ రాకేష్ కక్కర్ తెలిపారు. రాజధాని వార్తలు ఎడిటర్‌తో మాట్లాడుతూ అవుట్ పేషేంట్ సేవలు మార్చి నెల నుండి మొదలయ్యాయని, రోగులు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవలని కోరారు. ఇన్‌పేషేంట్ సేవలు 2020లో ప్రారంభం అవుతాయని తెలిపారు. రోగుల సౌకర్యం కొరకు తాము వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. అయితే విజయవాడ, మంగళగిరి నుంచి వచ్చే రోగుల ప్రయాణ సౌకర్యార్థం ప్రభుత్వం ఎయిమ్స్ గేటు వరకు ఆర్‌టీసి బస్సు సదుపాయాలను కల్పించాలని ఆయన తెలిపారు. రాష్ట్ర విభజన హామీలలో ఒకటైన ఎయిమ్స్ నిర్మాణం త్వరితగతిన సాగుతుందని ఆయన తెలిపారు. చాలా తక్కువ రుసుములతో వైద్య సదుపాయం కల్పిస్తున్నామని రోగులు ఈ అవకాశాని వినియోగించుకోవాలన్నారు. రానున్న రోజులో ఎయిమ్స్‌కు అనుబంధంగా రాజధాని ప్రాంతంలో ప్రాథమిక చికిత్సా కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు.

### బోటు ప్రమాదంపై చంద్రబాబు దిగ్భ్రాంతి



**రాజధాని వార్తలు, రాజమండ్రి :** తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం కచ్చులూరు దగ్గర జరిగిన బోటు ప్రమాదంపై టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. పాపికొండ లకు వెళ్తూ పర్యాటకులు, సిబ్బంది ప్రమాదానికి గురికావడం బాధాకరం అన్నారు. జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని కోరారు.

### బోటు ప్రమాదంపై స్పందించిన పవన్..



**రాజధాని వార్తలు, రాజమండ్రి :** తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం కచ్చులూరు దగ్గర జరిగిన బోటు ప్రమాదంపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాన్ స్పందించారు. బోటు ప్రమాదంలో సుమారు 50 మంది గల్లంతయ్యారనే విషయం బాధ కలిగించిందన్న పవన్.. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు తక్షణం ఘటనాస్థలానికి వెళ్లాల్సిందిగా జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు.





**రాజధాని వార్తలు : రాజధాని ప్రాంతంలో ( వెంటకపాలెం నుండి మంగళగిరి వెళ్లె రోడ్డు మార్గం పక్కన) ల్యాండ్ పూలింగ్ ద్వారా పొందిన వాణిజ్య ప్లాట్లలో పంటలు పండిస్తున్న రైతులు, సీఆర్‌డీఏ వేసిన హద్దులను చిత్రంలోని సర్కిల్‌లో చూడవచ్చు**

## ఎస్ఆర్ఎంను సందర్శించిన ఎమ్మెల్యే ఆర్కే



- యూనివర్సిటీ ప్రగతిని వివరించిన ప్రొ వీసీ

**రాజధాని వార్తలు, అమరావతి :** మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉదయం అమరావతి ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. యూనివర్శిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖరన్‌లు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే, యూనివర్సిటీ అభివృద్ధి, అడ్మిషన్లు,బోధన, విద్యార్థుల గురించి అడిగి తెల్సుకున్నారు. ప్రో వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు యూనివర్సిటీ ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. యూనివర్సిటీ **సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం కింద రానున్న రోజుల్లో నిడమర్రులోని ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి యూనివర్సిటీ ప్రణాళికలు తయారు చేస్తుందని డాక్టర్ నారాయణరావు వివరించారు.** ఈ సందర్భంగా ప్రో వీసీ, రిజిస్ట్రార్‌లు ఎమ్మెల్యే ఆర్కేను శాలువాతో సత్కరించి యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన శాటిలైట్ నమూనాను అందజేశారు. నిబంధనల ప్రకారం మెరుగైన విద్యావిధానాన్ని అమలు చేసి రాష్ట్ర పురోగతికి దోహదపడాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించారు.

## ఎస్ఆర్ఎంలో 'ఓనమ్' వేడుకలు

**రాజధాని వార్తలు అమరావతి :** కేరళ రాష్ట్ర సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఓనమ్ పండుగ వేడుకలు అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగాయి. స్టూడెంట్స్ అఫైర్స్ కమిటీ అధ్వర్యంలో వేడుకలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. వైస్ చాన్సలర్ డాక్టర్ జంషెడ్ భరూచా జ్యోతి ప్రజ్వలన జరిపి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీపీ, ప్రో వీసీలు ఓనమ్ పండుగ ప్రాముఖ్యతను వివరించి మళయాళీ విద్యార్థులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడ్మిన్ బ్లాకులో వివిధ రకాల పూలతో అందంగా తీర్చిదిద్దిన ముగ్గులను వీసీ, ప్రో వీసీలు పరిశీలించారు. అనంతరం నిర్వాహకులు వినీష్, నీలిమలు పండుగ



స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖరన్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ శివకుమార్, అడ్మిషన్స్ డైరెక్టర్ రూపేశ్, సీఎల్ఎం వెంకటాచలం, ప్రొఫెసర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఏటా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఎత్నిక్ డే పండుగను కూడా జరుపుకోవాలని ప్రో వీసీ నారాయణరావు సూచించారు.

## రాజధాని వార్తలు – సోషల్ మీడియా



వైఎస్సార్సీపీ అధినేత ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి "కులం చూడం, మతం చూడం, పార్టీ చూడమని అందరిని సొంత కుటుంబ సభ్యులుగా చూస్తా" అని చెప్పిన మాటలు నా హృదయం లో అచ్చుపడ్డాయి. తనది గొప్ప మనసు, పాలకులం కాదు సేవకులం అన్నది ఆయన నినాదం. సోషల్ మీడియాలో మహిళల మీద ట్రోలింగ్ ఖచ్చితంగా అరికట్టాలి. అది మన పార్టీ లేక వేరే పార్టీయా అని చూడకూడదు. మహిళలు ఇప్పుడే ధైర్యం చేసి బయటికి వస్తున్నారు. ఇటీవల ప్రతిభా బొప్పన టీడీపీ కార్యకర్తను వైసీపీ సోషల్ మీడియా అని చెప్పుకునే కొందరు ట్రోల్ చేశారు. అది చేయడం తప్పు అన్నా ఒక్క పోస్టుకు నన్ను 100 మంది ట్రోల్ చేశారు. తప్పుని నిజంగా అది తప్పని చెప్పే ధైర్యం కావాలి. తప్పు అని చెప్పిన వాడి కన్న తప్పు ఒప్పుకున్నవాడు గొప్ప. టీడీపీ సోషల్ మీడియా వాళ్లు చేసిన తప్పులను మనం చేయకుడదు. సోషల్ మీడియా ఒక గొప్ప వరం దానిని జాగ్రత్తగా వాడాలి. వైస్సార్‌సీపీ పార్టీ కూడా సోషల్ మీడియాను పట్టించుకోకపోతే చాలా నష్టం జరుగుతుంది. ప్రశాంత్ కిషోర్ లాగా ఒక సోషల్ మీడియా లీడ్ లేకపోవడం బాధకరం. ప్రభుత్వం సోషల్ మీడియా ట్రోలింగ్‌ని పరిగణలోకి తీసుకొని సరైన రీతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతను మంచి మార్గంలో పెట్టాలని కొరుకుంటున్నా.

– దీపికా కదారి, యూఎస్ఏ



మంగళగిరి పట్టణ శివారులో ఒకప్పుడు చెరువు భూములు గా ఉన్న ఈ ఆటోనగర్ రోడ్లను అందంగా తయారు చేశారు.

కానీ ముఖ్యమైన గౌతమ్ బుద్ధా రోడ్డు ను పరమ బేవార్స్ గా వదిలేశారు. రాజధాని నగరంలో ఉన్న ఈ పరిస్థితి కి కారణం ఎవరు? ఎమ్మెల్యే ఆర్ కె గారు గమనించాలి. గత 5 ఏళ్లు గా అధికారం లేదన్న భావన ఉంది. ఇప్పుడు పూర్తి అధికారం ఉంది కదా......ఆయనే కాదు అన్ని పార్టీలు గౌతం బుద్ధా రోడ్ ను పట్టించు కోవాలి. లేకుంటే ప్రజలు క్షమించరు.

– సీనియర్ జర్నలిస్టు కె.రూఫస్



## రాజధాని వార్తలు కలం

# వేచి చూడండి !

కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైన సందర్భంగా అనేక మంది విశ్లేషకులు, నిపుణులు, రాజకీయ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన పై తమ అభిప్రాయాలను, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మార్కులను వేస్తున్నారు. పలువురు తామే అంతాఇంతా అని పలు సూచనలు చేస్తున్నారు. ఇదంతా అంత తొందరగా చేయవలసిన అవసరమేమీలేదు. ప్రభుత్వ పాలన యంత్రాంగాన్ని దారిలో పెట్టడమంటే అని శాఖలలో సరైన అధికారులు, ఉద్యోగులు ఉండాలి. ఆదిశగా ముఖ్యమంత్రి ఎంతో హుందాగా అధికారుల బదిలీ ప్రక్రియ చేశారని చెప్పాలి. ఇక అస్తవ్యస్తంగా ఉన్న ప్రభుత్వాన్ని గాడిలో పెట్టడానికి ముఖ్యమంత్రి ప్రయత్నం చేయటాన్ని మనం చూస్తున్నాం. వైఎస్సార్‌సీపీ మానిఫెస్టోను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖలను సమన్వయంగా నడిపించటానికి కావలసిన అధికారాలను ఎంచుకున్నారు. తానే స్వయంగా 6 నెలల సమయంలో మంచి ముఖ్యమంత్రి అనిపించుకుంటానని ప్రమాణస్వీకార సమయంలో చెప్పటం మనకు గుర్తుంది. అత్యంత వేగంతో ముఖ్యమంత్రి తీసుకుంటున్న నిర్ణయాలను అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ప్రతిపక్షానికి ఆశ్చర్యాన్ని, ఒకింత అసహనానికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఎస్సి,ఎస్టీ, బిసి, మైనార్టీలకు పెద్ద పీట వేస్తూ వారి అభివృద్ధికి ప్రణాళికలను రచించి అమలు పరచే దిశగా జగన్ ముందడుగా వేయటంతో అటు బీజేపీ, ఇటు టీడీపీ అసహనాన్ని చూపుతున్నాయి. దాంతో ప్రతిపక్షానికి ఉన్న కాస్త ఓటు బ్యాంకు కూడా వైఎస్సార్‌సీపీ వైపు చూడడం టీడీపీ నాయకులకు ఒకింత భయంగా ఉంది. ప్రభుత్వాన్ని అస్థిరపరచే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లుంది. చలో ఆత్మకూరని, ఇసుక రాజకీయం కావచ్చు, ప్రజావేదిక కావచ్చు వీటన్నిటిని ఉపయోగించుకుని ప్రజలను తనవైపు తిప్పుకోవాలన్న తపన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబులో చూడవచ్చు. నిజం నిప్పులాంటిది. ఈ రోజు ప్రజలే రిపోర్టర్లుగా తమ ప్రాంతంలోని సన్నివేశాలను ఫోటోలతో సహా సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా వాటిపై ఆధారపడే పరిస్థితిని మనం చూస్తున్నాం. ఇంటెలెజెన్స్ వర్గాలు కూడా సోషల్ మీడియాను రిఫర్ చేస్తున్నాయంటే నిజాన్ని దాచి దోబూచుకోవాలని ప్రయత్నించే వారికి నష్టమే కాని ఏ మాత్రం ఫలితం ఉండదు. ఇక 100 రోజులలో జగన్ పాలన బాగాలేదనేవారికి వంద రోజులలో ఎంతచేయవచ్చో జగన్ నిర్ణయాలు, ఆ దిశగా వైస్సార్‌సీపీ అమలు చేస్తున్న పథకం కాలే ప్రత్యక్ష సాక్షి. గత ప్రభుత్వం పాలనలో అస్తవస్తంగా ఉన్న ఇసుక పాలసీనీ, గాడిలో పెట్టాలని జగన్ ప్రయత్నించడంలో కొంత జాప్యం జరిగి ఉండవచ్చు. దానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కారణమే. ఎందుకంటే ఇసుక మాఫీయాను ప్రొత్సహించింది టీడీపీ ప్రభుత్వమే. మరి ఇసుక సరఫరా పాలసీని గాడిలో పెట్టడానికి సమయం పట్టడం సర్వసాధారణం. అంతే కాకుండా గ్రామ సచివాలయ ఉద్యోగాలు, వాలంటీర్లను నియమించడం వంటి....పథకాలను అమలుకు శ్రీకారం చుట్టారు. ఒక సినిమా అయితే 100 రోజుల సమీక్ష చేయవచ్చు. అలాగే ఒక ఇల్లు మారితేనే కొన్ని వారాలపాటు సర్దుకోవటానికి సమయం పడుతుంది. అలాంటిది 100 రోజుల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై సమీక్షి చేయటం సరైనదికాదు. అయితే కనీసం 6 నుండి 12 నెలల సమయంలో మనం ఒక అవగాహన, ఒక సమీక్ష, ఒక సిఫారసు, లేక ఒక సద్విమర్శ చేయవచ్చు. కాబట్టి ఆవేశంతో కాకుండా సమన్వయంతో ప్రజలు నూతన ప్రభుత్వానికి సమయమిచ్చి సహకరించాలి.

# అవినీతిపై ప్రజా ఆయుధంగా లోకాయుక్త

**– జనచైతన్య వేదిక**

**రాజధాని వార్తలు, విజయవాడ :** అవినీతిపై ప్రజా ఆయుధంగా లోకాయుక్త వ్యవస్థ తోడ్పడుతుందని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా నియమితులైన జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో గేట్వే హోటల్ కాన్ఫెరెన్స్ హాలులో ఆత్మీయ సత్కార సభ జరిగింది. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. జస్టిస్ వి.లక్షణరెడ్డి ప్రసంగిస్తూ అవినీతి నిర్మూలనకు, పారదర్శక పాలనకు ప్రజలను జాగృతులను చేయాలన్నారు. అన్నా హజరే కృషితో కేంద్రంలో లోక్ పాల్ వ్యవస్థ అవతరించడం మంచి పరిణామం అన్నారు. అన్ని రాష్ట్రాలలో బలమైన లోకాయుక్త వ్యవస్థలు ఏర్పడాలన్నారు. వ్యవస్థ అంతా అవినీతిమయంగా మారిందని ఈ పరిస్థితులలో ప్రజలు,మేదావులు, స్వచ్ఛంద సంస్థలు అవినీతికి వ్యతికేకంగా బలమైన ఉద్యమాలు చేయాలన్నారు. విద్యాధికులలోనే అవినీతి ఎక్కువగా వుందని అన్నారు. సార్వభౌమాధికారులుగా వుండాల్సిన ప్రజలు నిస్సహాయులుగా మారుతున్నారన్నారు. తప్పు ఋజువైతే ఏ స్థాయిలో వున్న ప్రజా ప్రతినిధినైనా, అధికారులనైనా ఉపేక్షించేదిలేదన్నారు. మీమీ ప్రాంతాలలో జరుగుతున్న అవినీతిపై ఋజువులతో లోకాయుక్తకు ఫిర్యాదు చేయాలని, సత్వర న్యాయం చేయటానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. తప్పుడు కేసులు ఫిర్యాదు చేస్తే సంవత్సరం పాటు జైలు శిక్షతో కూడిన శిక్ష వుంటుందని హెచ్చరించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అద్యక్షులు వి.లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి నిరంతరం అవినీతి రహిత పాలన, పారదర్శక పాలన కోరుకుంటున్నారని లోకాయుక్త నియామకం వారి లక్ష్యాన్ని నెరవేరుస్తుందన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు అవినీతి నిర్మూలనపై తగిన శిక్షణ అందిస్తే సత్ఫలితాలు వస్తాయనీ, అవినీతి గణనీయంగా తగ్గుతుందన్నారు. జనచైతన్య వేదిక మద్య వ్యతిరేక ఉద్యమంతో పాటు అవినీతికి వ్యతిరేరకంగా ప్రజలను జాగృతులను చేయటానికి కృషి చేస్తామన్నారు. ప్రముఖ న్యాయకోవిదుడు, తెలుగు ప్రజలు




ఐక్యంగా వుండాలని, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని ఆకాంక్షించే జస్టిస్ పి. లక్ష్మణరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్తగా నియమించడాన్ని అభినందించారు. ప్రముఖ మానసిక వ్యాధి నిపుణులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, సెంట్రల్ కస్టమ్స్ జాయింట్ కమీషనర్ యం. శ్రీకాంత్, జి.యస్.టి డిప్యూటి కమీషనర్ సి.యస్.రాజు, రిటైర్డ్ జాయింట్ కమీషనర్ ఎక్సైజ్ జి. జోషప్, జనచైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ జి.విజయసారధి, ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టర్, రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ అద్యక్షులు కె.వి.కృష్ణయ్య, రాష్ట్ర అర్చక సంఘం అద్యక్షులు సాయినాథ్ తదితరులు ప్రసంగించి, జస్టిస్ పి.లక్ష్మణరెడ్డిని ఘనంగా సత్కరించారు.

# హిందూమతాన్ని విశ్వసిస్తున్నట్టు అఫిడవిట్ ఇవ్వాలి

- అన్ని దేవాలయాలు, హిందూమత సంస్థలు, కార్యాలయాలకు సర్క్యులర్
- రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కన్సాలిడేటెడ్ ఉద్యోగులందరికీ వర్తింపు
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ కమిషనర్

**రాజధాని వార్తలు, అమరావతి :** దేవదాయ శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగులంతా హిందూమతాన్ని విశ్వసిస్తున్నట్టు అఫిడవిట్ ఇవ్వాలని ఆ శాఖ శనివారం సర్క్యులర్ జారీ చేసింది. దేవదాయ శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగుల్లో అన్యమతస్తులు ఉన్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈమేరకు చర్యలు చేపట్టింది. దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు హిందూమతాన్ని విశ్వసిస్తున్నట్టు అఫిడవిట్ తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ కమిషనర్ పద్మ సర్క్యులర్ జారీ చేశారు. దేవాలయాలు, దేవదాయ శాఖ కార్యాలయాలు, సంస్థ ఉద్యోగుల నుంచి అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించారు.

నిర్ణీత పత్రంలో అఫిడవిట్ 15 రోజుల్లోగా కమిషనర్ కార్యాలయంలో అందచేయాలని



సూచించారు. దేవదాయ చట్టం ప్రకారం హిందూ మతస్తులనే ఉద్యోగులుగా, ఆలయాల్లో తీసుకోవాలనే స్పష్టమైన నిబంధన ఉంది. తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులో పేర్కొన్నారు. రెగ్యులర్, కాంట్రాక్టు, కన్సాలిడేటెడ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నుంచి తీసుకోవాల్సిన అఫిడవిట్ ఫ్రొఫార్మను దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలతోపాటు అన్ని దేవదాయ శాఖ సంస్థలు, ఆలయాలకు కమిషనర్ పంపించారు.

# గోదావరిలో బోటు మునక

(మొదటిపేజీ తరువాయి)

సుచరిత ఆరా తీశారు. సహాయక చర్యలపై డీజీపీ, జిల్లా ఎస్పీతో మాట్లాడారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని, గల్లంతు అయినవారి కోసం గాలించి సరక్షిత ప్రాంతాలకు చేర్చాలని ఆదేశాలు ఇచ్చారు. ఇక పోలవరం ఎమ్మెల్యే బాలరాజు కూడా లాంచీ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ ముత్యాల రాజుతో మాట్లాడారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కోరారు.

తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం కచులూరు సమీపంలో పాపికొండలకు విహార యాత్రకు వెళుతున్న పర్యాటక బోటు మునిగిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బోటులో 71మంది ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో 27మంది సురక్షితంగా బయటపడగా, పలువురు గల్లంతు అయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**బోటు ప్రమాద ఘటనపై సీఎం జగన్ సీరియస్**

తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం సమీపంలో బోటు పమ్రాద సంఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీఎం జగన్... యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించాలని, నేవీ, ఓఎన్‌జీసీ హెలికాఫర్లను సహాయక చర్యల్లో వినియోగించాలన్నారు. ఘటనా స్థలానికి వెళ్లాల్సిందిగా అందుబాటులో ఉన్న మంత్రులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు.

అలాగే ఈ సంఘటనపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈసందర్భంగా అధికారులను ఆదేశించారు. తక్షణమే అన్ని బోటు సర్వీసులను రద్దు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రయాణానికి అనుకులమా? కాదా అన్నదానిపై క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సీఎం



సూచించారు. లైసెన్సులు పరిశీలించాలని, బోట్లను నడిపేవారు, అందులో పని చేస్తున్న వారికి తగిన శిక్షణ, నైపుణ్యం ఉందా? లేదా అనే దానిపై తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. బోట్లలో ముందస్తు జాగ్రత్తలు ఉన్నాయా లేదా అనేది కూడా పరిశీలించాలన్నారు. నిపుణులతో పటిష్టమైన మార్గదర్శకాలు తయారు చేసి తనకు నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు. కాగా ఇప్పటి వరకూ అయిదు మృతదేహాలను వెలికి తీశారు. మరోవైపు గల్లంతు అయినవారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# అహంకారంతో విర్రవీగితే చూస్తూ ఊరుకోం: ఎమ్మెల్యే శ్రీదేవి

**టీడీపీ నేతలపై ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఫైర్**

**రాజధాని వార్తలు, అమరావతి :** టీడీపీ నేతలు అహంకారంతో విర్రవీగుతూ.. కుల వివక్షత చూపుతున్నారని తాడికొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మండిపడ్డారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వినాయక మండపం వద్ద కులం పేరుతో దూషించిన టీడీపీ నేతలపై ఎస్సీ,మహిళా కమిషన్లకు ఫిర్యాదు చేశానని తెలిపారు. కుల వివక్షత ప్రదర్శించిన వారిపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరినట్లు చెప్పారు. టీడీపీ నేతల ఆగడాలను చూస్తూ ఊరుకోమని..అడ్డుకుంటామన్నారు. కేసులోని నిందితులందరికీ శిక్షలు పడేవరకు పోరాటం చేస్తామని ఆమె స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో విశాఖ జిల్లా జెర్రిపోతుల గ్రామంలో దళితులను గ్రామ బహిష్కరణ చేసిన విషయాన్ని ఎమ్మెల్యే శ్రీదేవి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక కర్నూలు జిల్లాలో శవాన్ని పూడ్చిపెట్టేందుకు గొయ్యి తవ్వినందుకు దళితుల ఆస్తులన్నింటినీ ధ్వంసం చేశారని తెలిపారు. నారా వారిపల్లెలో దశాబ్దాలుగా దళితులను ఓట్లు వేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు.

చంద్రబాబు ఓటు బ్యాంకుగా వాడుకుంటే...వైఎస్ జగన్ పల్లకిలో



మోస్తున్నారు.. 'ఎవరైనా దళితులుగా పుట్టాలని కోరుకుంటారా' అని గతంలో చంద్రబాబే స్వయంగా వ్యాఖ్యనించారని ఎమ్మెల్యే శ్రీదేవి గుర్తుచేశారు. యధారాజా తథా ప్రజ అన్నట్టుగా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.




# నవంబరు 17న వైజాగ్ నేవీ మారథాన్..

**రాజధాని వార్తలు, విశాఖ :** వైజాగ్ నేవీ మారథాన్‌ను నవంబరు 17వ తేదీన నిర్వహించనున్నట్టు ఈస్ట్రన్ నేవల్ కమాండెంట్ అతుల్‌కుమార్ జైన్ తెలిపారు. గురువారం హోటల్ నోవాటెల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ పరుగు ద్వారా ఆరోగ్యకమైన జీవితాన్ని పొందవచ్చని తెలిపేందుకు విశాఖలోని ఈస్ట్రన్ నేవల్ కమాండెంట్ ఆధ్వర్యంలో వైజాగ్ ఆరవ ఎడిషన్ నేవీ మారథాన్‌ను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా కరేజ్ రన్ 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, డెన్సిటీ రన్ 25 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్, ఫ్రెండ్‌షిప్ రన్ 10 కిలోమీటర్ల మారథాన్, రన్ ఫర్ ఫన్ పేరుతో 5 కిలోమీటర్ల రన్ మారథాన్‌లను నిర్వహించనున్నట్టు తెలిపారు ఈ మారథాన్ పరుగు బీచ్ రోడ్డులోని విష్ణుప్రియా ఫంక్షన్ హాల్ వద్ద ప్రారంభించి తీర ప్రాంతం మీదుగా గీతం కాలేజీ వరకు వెళ్లి, తిరిగి విష్ణుప్రియా ఫంక్షన్ హాల్‌కు చేరుకోవడంతో ముగియనున్నట్టు తెలిపారు. దేశంలో ఇతర ప్రాంతాల్లో జరిగే మారథాన్‌లు కన్నా విశాఖలో జరిగే మారథాన్‌కు ప్రత్యేకత ఉంటుందన్నారు. ఇందులో సుమారు 18,000 మంది పాల్గొంటారని, అంతర్జాతీయ పరుగు క్రీడాకారులు కూడా పాల్గొంటారని చెప్పారు. దీనికి సంబంధించిన లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళింగ సీఈవో గోపాలకృష్ణ, కేర్ ఆస్పత్రి డైరెక్టర్ మోహన్ మహరాజ్, వెంకటరమణ, బాలకృష్ణ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

### రాజధానిలో తవ్వేకొద్దీ 'ఇన్‌సైడర్' బాగోతాలు

(మొదటిపేజీ తరువాయి)

అక్టోబర్ 10, 2014న 67సెంట్లు, కురగల్లులో సర్వే నెంబర్ 8/2 అక్టోబర్ 14, 2014న ఎకరం 29సెంట్లు కూతురు గోనుగుంట్ల లక్ష్మీసౌజన్య పేరుతో కొనుగోలు చేసినట్లు తెలిసింది. 2014 నవంబర్ 27న లింగాయపాలెంలో సర్వే నెంబర్ 149లో ఎకరం 25సెంట్లు తండ్రి గోనుగుంట్ల సత్యనారాయణ పేరుతో ఆంజనేయులు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

# ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



**రాజధాని వార్తలు :** మానవ సేవా సంస్థ ద్వారా ప్రజలకు ట్రాఫిక్ రూల్‌పై అవగాహన, మానవ సేవా సంస్థ గత 20 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలుచేస్తూ నూతనంగా కృష్ణా, గుంటూరు జిల్లాలలో ట్రాఫిక్ రూల్‌పై ప్రజలకు అవగాహనతెచ్చే పరంగా ఈ రోజు రాష్ట్రా హోం మినిస్టర్ గౌ॥ మేకటోటి సుచరిత ను కలిసి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్‌బెల్ట్ దరించేవిధంగా, హెల్మెట్ దరించేవిధంగా ప్రజలకు అవగాహన తెచ్చేవిధంగా పలుకార్యక్రమాలు చేయనున్నట్లు వంగర సురేష్ కుమార్ మంత్రి మేకతోటి సుచరిత కు వివరించారు. ఈ సందర్భంగా మానవ సేవ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆమె అభినంధించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వంగర సురేష్ కుమార్, జాయిద్ సీ, కె. ఆదినారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**రాజధాని వార్తలు దినపత్రికకు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో మండల రిపోర్టర్లు కావలేను, సంప్రదించండి ఫోన్ : 9440662699, 7680994755**

### బోటు ప్రమాదంపై సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి



**హైదరాబాద్ :** కచ్చులూరు మండలం దేవీపట్నం సమీపంలో గోదావరిలో జరిగిన బోటు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన.. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల్లో తెలంగాణ వాసులు కూడా ఉండటంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# అత్యంత పారదర్శకంగా రివర్స్ టెండరింగ్

**ఇరిగేషన్ శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్..**

**రాజధాని వార్తలు, అమరావతి :** పోలవరం రివర్స్ టెండరింగ్‌పై మీడియా అవాస్తవాలను ప్రచారం చేస్తోందని ఏపీ ఇరిగేషన్ శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టులో వందల కోట్లు చేతులు మారాయని.. ఆనాడూ జరిగిన అవినీతిని రామోజీరావు తన పత్రికలో ఎందుకు రాయలేదని ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ ద్వారా 20 శాతం వరకు టెండర్లు వేస్తే ప్రజలకు, ప్రభుత్వానికి వందల కోట్ల



మేలు జరిగే అవకాశం ఉంటుందనే సంగతి తెలిసి కూడా తప్పుడు కథనాలు ఎందుకు రాస్తున్నారో రామోజీరావు సమాధానం చెప్పాలన్నారు.

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వమే ఆర్‌అండ్‌ఆర్ ఖర్చులు భరించడంతోపాటు, అనుమతులన్నీ సాధించి పోలవరం ప్రాజెక్టును నిర్మించి ఇవ్వాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత దాదాపు 31 నెలలు పోలవరం పనులు జరగకుండా మోకాలడ్డు పెట్టారన్నారు. చంద్రబాబు.. ప్రత్యేక హోదాను తాకట్టును పెట్టి పోలవరం ప్రాజెక్టును తనకు ఇవ్వాల్సిందిగా 2016 సెప్టెంబర్ 8న అర్ధరాత్రి ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. లంచాలు, కమీషన్లు ఇచ్చిన అస్మదీయులకు బాబు కాంట్రాక్టులు అప్పగించారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు అంచనాలు పెంచి.. చంద్రబాబులా డబ్బు దోచుకునేవిధంగా కాకుండా.. ప్రాజెక్టు వ్యయం తగ్గించేవిధంగా దేశంలోనే తొలిసారిగా అత్యంత పారదర్శకంగా టెండర్లను పిలిచి రివర్స్ టెండరింగ్‌ను అమలు చేస్తున్నామన్నారు.

# డిసెంబర్లో మున్సి'పోల్స్'!

- నవంబరు నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలు
- కొత్త మున్సిపాలిటీలపై త్వరలో నిర్ణయం
- కమిషనర్లు మెరుగైన సేవలందించాలి
- ప్రజల కాల్స్ అన్నీ తప్పకుండా తీసుకోవాలి
- 4-5 రోజుల్లో పెండింగ్ బిల్లుల క్లియరెన్స్
- మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి
- కమిషనర్ల వర్క్ షాపులో విస్తృత చర్చ

**రాజధాని వార్తలు అమరావతి :** రాష్ట్రంలోని 110 పట్టణ స్థానిక సంస్థలకు డిసెంబరులో ఎన్నికలు నిర్వహిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. వీటికి సంబంధించిన ఎన్నికల ప్రక్రియను నవంబరులో ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతమున్న పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల్లో వాటి చుట్టుపక్కల ఉన్న గ్రామాలు, ప్రదేశాలను కొత్తగా చేర్చడంపై ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించదని.. సంబంధిత వర్గాలు, ప్రజలందరి అభిప్రాయానుసారమే నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. నూతన మున్సిపాలిటీల ఏర్పాటుపై త్వరలోనే విధాన నిర్ణయం తీసుకుంటామన్నారు. గురువారం విజయవాడలో మున్సిపల్ కమిషనర్ల రెండ్రోజుల వర్క్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. పట్టణ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసి పట్టణాల ప్రజలకు మెరుగైన సేవలందించడమే తమ ధ్యేయమన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు వేటికవేగా వ్యవహరిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), టౌన్ ప్లానింగ్ తదితర సంస్థలన్నీ పురపాలక శాఖ పరిధిలో పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తాయని చెప్పారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సుమారు 95 శాతం కమిషనర్ల ఇష్టప్రకారమే చేపట్టామని, వారికి అనువైన ప్రదేశాల్లో నియమించామని, దీనిని దృష్టిలో ఉంచుకుని వారందరూ వివిధ విభాగాల మధ్య సమన్వయం సాధిస్తూ, సత్ఫలితాలు సాధించాలని కోరారు. ప్రభుత్వం అందజేసిన సెల్‌ఫోన్లకు ప్రజలు ఎవరు ఫోన్ చేసినా స్పందించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. అభ్యంతరాలున్న వారు ఫోన్లను తిరిగిచ్చేయాలని సూచించారు. ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్లను తిరిగి నియమించడం ద్వారా మున్సిపల్ విద్యారంగాన్ని గాడిన పెట్టవచ్చని చెప్పారు.

**ఉద్యోగుల కొరత ఉండదు..**

వార్డు వలంటీర్లతోపాటు త్వరలోనే విధుల్లో చేరనున్న 37,000 మంది వార్డు కార్యదర్శులతో పట్టణ స్థానిక సంస్థల్లో సిబ్బంది కొరత అనే మాటే ఇక వినిపించదని బొత్స అన్నారు. వారందరి తోడ్పాటుతో లోపరహితంగా పరిపాలన అందించాలని కమిషనర్లకు సూచించారు. వార్డు కార్యదర్శుల పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించారంటూ కమిషనర్లను, ఉద్యోగులను అభినందించారు. ఖాళీ ఖజానా, కొండలా పేరుకుపోయిన బిల్లులతో తమ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పడిందన్నారు. అయినప్పటికీ అభివృద్ధి పనులు ఆగిపోరాదన్న ఉద్దేశంతో పట్టణ స్థానిక సంస్థల్లోని గత



బిల్లులన్నిటినీ నాలుగైదు రోజుల్లో చెల్లిస్తామని ప్రకటించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు కమిషనర్లు పకడ్బందీ కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. పారిశుద్ధ్య పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రమైన తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు తెలుసుకునేందుకు తరచూ తనిఖీలు చేయబోతున్నామని.. లోపాలు కనిపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే ఉగాదికల్లా పట్టణ పేదలకు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల వరకు ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, ఇది కార్యరూపం దాల్చేలా కమిషనర్లు, ఏపీ టిడ్కో సంయుక్తంగా కృషి చేయాలన్నారు. వాటర్‌గ్రిడ్ ఏర్పాటు ద్వారా పట్టణ వాసులందరికీ పరిశుద్ధమైన తాగునీటిని అందించడంలో కేంద్రం ఆధ్వర్యంలోని జల్‌శక్తి అభియాన్‌తో కలసి పనిచేయాలని చెప్పారు. ఈ దిశగా ఇప్పటికే 4 జిల్లాల్లో చర్యలు తీసుకున్నామని, క్రమంగా అన్ని జిల్లాలకూ విస్తరిస్తామన్నారు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల మార్పిడి తప్పితే ఇప్పటికే పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను తొలగించరాదని స్పష్టం చేశారు. వర్క్‌షాపులో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, పురపాలక కమిషనర్ జేఎస్సార్కేఆర్ విజయకుమార్, ఏపీ టిడ్కో ఎండీ బి.ఎం.దివాన్ మైదీన్, డీటీసీపీ వి.రాముడు, అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, పురపాలక శాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఉన్నతాధికారులు తదితరులు హాజరయ్యారు.

**అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాపు ముగింపు సమావేశంలో మంత్రి బొత్స

అమరావతి: రాష్ట్రంలో అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. పట్టణాభివృద్ధిలో విశేష అనుభవం ఉన్న ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తుందని చెప్పారు. శుక్రవారం విజయవాడలో మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాపు ముగింపు కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఇటీవల నియమితులైన వార్డు వలంటీర్లు, రానున్న సచివాలయ వ్యవస్థను వాడుకుని పట్టణ ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి కమిషనర్లు కృషి చేయాలన్నారు.

ముఖ్యంగా పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. పురపాలక విభాగాల్లో అధికారులతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ స్కూళ్లలో విద్యాప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మంచినీటి కుళాయిల ఏర్పాటు, రక్షిత మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్పందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షల్లో వాస్తవాలనే అధికారులు వివరించాలని, అవాస్తవ గణాంకాలతో మభ్యపరిచే ప్రయత్నం చేయొద్దన్నారు.

మున్సిపల్ శాఖ కార్యదర్శి జె.శ్యామలరావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న మున్సిపల్ నిధులతో పాఠశాలల మరమ్మతులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడదామన్నారు. మున్సిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ విద్యాప్రమాణాల మెరుగుకు ప్రత్యేక కార్యాచరణను అమల్లోకి తీసుకువస్తామని చెప్పారు. వర్క్‌షాపులో మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డీఎంఏలు, మెప్మా పీడీలు, ఇంజనీర్లు, మధ్యాహ్నం జరిగిన సమావేశంలో ఏపీటిడ్కో ఎండీ దివాన్, ఈఎన్‌సీ చంద్రయ్య, డీటీసీపీ రాముడు, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీ సంపత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కృత్రిమ కాళ్ల చిన్నారి మోడల్..



పుట్టుకతోనే వైకల్యం. కాలి ఎముకలను అరుదైన వ్యాధి కబళించింది. 18 నెలల వయసుకే రెండు కాళ్లనూ కోల్పోయింది. అయితే, కొండంత ఆత్మస్థైర్యం ఆమె సొంతం అందుకే కృత్రిమ కాళ్లతో తొమ్మిదేళ్ల డెయిసీ మే దిమిత్రి మోడల్‌గా రాణిస్తోంది.

ప్రఖ్యాత న్యూయార్క్ ఫ్యాషన్ వీక్ షోతోపాటు పారిస్ ఫ్యాషన్ వీక్‌లోనూ మెరవబోతున్న రెండు కాళ్లులేని తొలి చిన్నారిగా డెయిసీ చరిత్ర సృష్టించబో తోంది. డెయిసీ స్వస్థలం బ్రిటన్‌లోని బర్మింగ్హామ్. పుట్టుకతోనే తనకు ఫిబ్యులర్ హెమిమెలియా సోకింది. ఈ వ్యాధి వల్ల కాలి ఎముకలో కొంత భాగం లేదా పూర్తిగా కనుమరుగవుతుంది. 50 వేల మందిలో ఒకరిని మాత్రమే ఇలాంటి లోపం చుట్టుముడుతుంది.

18 నెలలు వచ్చేసరికి డెయిసీ లోపం మరింత తీవ్రమైంది. దీంతో ఆమె తల్లిదండ్రులు అలెక్స్, క్లెయిర్ దిమిత్రి కఠిన నిరయం తీసుకోవాల్సి వచ్చింది. మోకాలిపై వరకూ రెండు కాళ్లూ తొలగించకపోతే ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు చెప్పడంతో ఆపరేషన్‌కు వారు అంగీకరించారు. దీంతో కృత్రిమ కాళ్లే డెయిసీకి శరణ్యమయ్యాయి.

వైక్యలం ఏనాడూ డెయిసీకి అవరోధం కాలేదు. చదువుతోపాటు జిమ్నాస్టిక్స్‌లోనూ తను ప్రావీణ్యం సాధించింది. అంతేకాదు, ఎనిమిదేళ్ల వయసులోనే రివర్ ఐలాండ్ బ్రాండ్‌కు మోడలింగ్‌తో ఫ్యాషన్ ప్రపంచంలోకీ అడుగుపెట్టింది. ప్రస్తుతం బ్రిటన్‌లోని దిగ్గజ వస్త్ర విక్రయ సంస్థ బోడెన్‌కు మోడల్‌గానూ పనిచేస్తుంది. నైకీ, మ్యాటలాన్ లాంటి బ్రాండ్లనూ తను ప్రమోట్ చేసింది. ఈ నెల 8న డెయిసీ మోడలింగ్ కెరియర్‌లో అత్యున్నత శిఖరాన్ని అధిరోహించింది. ప్రఖ్యాత న్యూయార్క్ ఫ్యాషన్ వీక్‌లో తను తళుకులీనబోతోంది. ఇక్కడ ర్యాంప్‌పై వాక్ చేయబోతున్న రెండు కాళ్లులేని తొలి చిన్నారి డెయిసీ అని ఇప్పటికే న్యూయార్క్ ఫ్యాషన్ వీక్ ప్రకటించింది. మరోవైపు ప్రఖ్యాత పారిస్ ఫ్యాషన్ వీక్‌లోనూ డెయిసీ మెరవబోతోంది. పారిస్‌లోని ఈఫిల్ టవర్‌పై సెప్టెంబరు 27న ఈ షో జరగబోతోంది. చిన్నారుల ఫ్యాషన్ బ్రాండ్ 'లూలూ ఎట్ జిజి'ను తను ప్రమోట్ చేయబోతోంది.

లండన్‌లోని ఓ ఫ్యాషన్ షోలో డెయిసీని 'లూలూ ఎట్ జిజి' ఫౌండర్ ఎని హెజెడస్ బ్యూరన్ చూశారు. ఆత్మవిశ్వాసంతో డెయిసీ వేస్తున్న అడుగులను చూసి ఆమె మంత్రముగ్ధురాలయ్యారు. న్యూయార్క్ ఫ్యాషన్ వీక్‌లో డెయిసీ మెరవబోతుందనే వార్తలే డెయిసీకి పారిస్ అవకాశాన్ని తెచ్చిపెట్టాయని ఆమె తండ్రి అలెక్స్ అన్నారు. "ఇవి ఎంత పెద్ద అవకాశాలో డెయిసీకి చెబుతుంటే, 'డాడ్, ఇట్స్ కూల్' అంది. ఇంకా సాధన చేయాలనుకుంటున్నావా అని అడిగితే, 'ఇవి నాకు కొత్తమీ కాదు' అని బదులిచ్చింది" అని ఆయన చెప్పారు.

'షోలో ర్యాంప్ వ్యాక్ చేసేందుకు అవసరమైన కృషి ఇప్పటికే తను మొదలుపెట్టింది. ఆమెను చూసేవాళ్లు జాలిపడరు. 'అద్భుతం ఆమెలా నేనూ అవ్వాలి' అనుకుంటారు. తనలో ఎంతో ఉత్సాహం ఉంది" అని అలెక్స్ వివరించారు. "చేసే పనిని డెయిసీ అమితంగా ప్రేమిస్తుంది. ప్రపంచానికి తను కనువిప్పు కలిగించబోతోంది. మేం ఎంతో గర్వపడుతున్నాం" అని ఆమె తండ్రి తన కూతురి గురించి గొప్పగా చెబుతూ మురిసిపోతున్నారు.

## ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు అరుదైన ఘనత

**రాజధాని వార్తలు, అమరావతి :** నరసరావుపేట పార్లమెంటరీ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అరుదైన ఘనతను దక్కించుకున్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన పార్లమెంటరీ కమిటీల చైర్మన్, సభ్యులు జాబితాలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చోటు దక్కించుకున్నారు. కేంద్ర మానవవనరుల మంత్రిత్వ శాఖకు



సంబంధించిన కమిటీ మెంబర్‌గా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును కేంద్రప్రభుత్వం ఎంపికచేసింది. ఈ కమిటీ సభ్యత్వం ఐదేళ్ల పాటు కొనసాగుతుంది. పార్లమెంటరీ సమావేశాల సమయంలో శ్రీకృష్ణదేవరాయలు నియోజకవర్గంలోని పలు సమస్యలతో పాటు దేశస్థాయిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అనర్గలంగా మాట్లాడారు. ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పార్లమెంటరీ కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన ఇప్పుడు ఈ కమిటీ మెంబర్‌గా ఎన్నికయ్యారు. దేశ స్థాయిలో విద్యాసంస్థలు నడుపుతూ మంచి విద్యావేత్తగా గుర్తింపు పొందినందున ఆయనకు ఈ కమిటీలో చోటు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొట్టమొదటి సారిగా ఎంపిగా ఎన్నికై పలు పదవులు చేపడుతున్న శ్రీకృష్ణదేవరాయలకు దేశ, రాష్ట్ర స్థాయిలోని ప్రముఖులు, వైస్సార్‌సీపీ వెలగపూడి నాయకులు జొన్నలగడ్డ కిషోర్ అభినందనలు తెలిపారు.

## 'ఆంధ్రా బ్యాంకు విలీనాన్ని అందరూ వ్యతిరేకించాలి'



**రాజధాని వార్తలు, కృష్ణా :** ఆంధ్రా బ్యాంకును యూనియన్ బ్యాంకులో విలీనం చేయడమంటే అయిదు కోట్ల ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీపీఐ నగర కార్యదర్శి దోనెపూడి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆంధ్రా బ్యాంకు విలీనాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వంద వసంతాల వైపు అడుగులు వేస్తున్న ఆంధ్రా బ్యాంక్‌ను విలీనం చేయడం ద్వారా బ్రాంచీలు మూతపడి ఉద్యోగాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. కాగా ఆంధ్రా బ్యాంకును విలీనం చేయడాన్ని రాష్ట్ర ప్రజలు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వ పనితీరుపై విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని విమర్శించారు. బ్యాంకుల నుంచి మొండి బకాయిలు వసూలు చేయడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఎల్ఐసీ, రైల్వే, బీఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి మోదీ ప్రభుత్వం సమాయత్తమవుతోందని దోనెపూడి పేర్కొన్నారు.

## 'బ్యాంకుల విలీనంతో ఉద్యోగాలలో కోత'




**రాజధాని వార్తలు, విజయవాడ :** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న బ్యాంకుల విలీన నిర్ణయం ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసేలా ఉందని అలహాబాద్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంకుల విలీన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విజయవాడలో అసోసియేషన్ నిరసన ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ బ్యాంకుల విలీనం వల్ల బ్యాంకు ఉద్యోగాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బ్యాంక్ ఖాతాదారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్మకాసేలా ఈ నిర్ణయం ఉందని విమర్శించారు. బ్యాంకుల విలీన విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, విలీన నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరిం చుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



రాజధాని వార్తలు, అమరావతి : వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ పీవీ సింధు, ముఖ్యమంత్రి శ్రీ వైయస్. జగన్మోహన్ రెడ్డిని సచివాలయంలో కలుసుకున్నారు. సింధుకు గౌరవ ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

## ఇసుక స్టాక్ పాయింట్ ను పరిశీలించిన పవన్

**రాజధాని వార్తలు, మంగళగిరి :** మంగళగిరి మండలం నవులూరు ఇసుక స్టాక్ పాయింట్ ను పరిశీలించిన పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ ఇసుక కొరత బాగా ఉందని, ఇబ్బందులు పడుతున్నామని పవన్ కు వివరించిన ప్రజలు, కార్మికులు నాదెండ్ల మనోహర్ కామెంట్స్. ఇసుక కొరతతో కార్మికులు ప్రజలు అల్లాడుతున్నారు. తక్కువ ధరకే ఇసుక ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అదనంగా చార్జీలు వసూలు చేస్తుంది. మూడు నెలలుగా పనులు లేక కార్మికులు పస్తులు ఉన్నారు. ప్రజలకు తక్కువ ధరకే ఇసుక ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పవన్ కళ్యాణ్ కామెంట్స్. గత ప్రభుత్వ హయాంలో ప్రైవేటు వ్యక్తులు ఇసుక దోచుకున్నారు. అధికార, విపక్ష ఎమ్మెల్యేలు ఇసుక రీచ్‌లను పంచుకున్నారు. అందరికీ అందుబాటులో ఇసుక అన్న వైసిపి ప్రభుత్వం మూడు నెలలుగా అందకుండా చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణాలు నిలిచిపోయి ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఇసుక ధరలు మరింత పెంచి ప్రజలపై భారం మోపింది. టన్ను 370 కి ఇస్తున్నామంటున్నా, అదనంగా 590 రూపాయలు వసూలు చేయడం అన్యాయం. జగన్ మాటల్లో పారదర్శకత తప్ప పనుల్లో



ఎక్కడా కనిపించడం లేదు. కార్మికులందరూ కష్టాలు అనుభవించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇసుకతో పాటు అనేక అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. వైఎస్ జగన్ వంద రోజుల పాలన పై రేపు మీడియా సమావేశంలో అన్ని వివరాలు వెల్లడిస్తా.

## ఇంజనీర్స్ దినోత్సవం సందర్భంగా

**రాజధాని వార్తలు :** ఈరోజు భారతదేశపు ప్రముఖ ఇంజనీయరుగా ప్రసిద్ధి చెందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టినరోజు ఇంకొద్ది క్షణాల్లో ఈ వంతెన కూలిపోతున్నది...రైలును ఆపండి అంటూ కేకలు వేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన సునిశిత మేధావి వెటరీక్షగుండం విశ్వేశ్వరయ్య.

శ్రీనివాసశాస్త్రి, వెంకటలక్ష్మమ్మలకు 1861 సెప్టెంబర్ 15న విశ్వేశ్వరయ్య జన్మించాడు. ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలు అనిర్వచనీయం. వందేళ్లు కాదు... తరతరాలకు గుర్తుండిపోయేలా విశ్వేశ్వరయ్య తెలుగునేలపై చూపిన ప్రతిభ ప్రపంచంలోని ఇంజనీర్లకు గొప్ప పాఠాలు. హైదరాబాద్ చరిత్రలోనే అవి అత్యంత భారీ వరదలవి. కనీవినీ ఎరుగని రీతిలో మూసీ నది ఉప్పొంగింది. 50 వేల మంది హైదరాబాదీలను పొట్టనబెట్టుకుంది. 17 సెంటీమీటర్ల వర్షం కురవడంతో మూసీ ఉగ్రరూపం దాల్చింది. బ్రిడ్జీలు కొట్టుకుపోయాయి. హైదరాబాద్ రెండుగా చీలింది. అలా చీలిపోయిన హైదరాబాద్‌కు పురానాపూల్ బ్రిడ్జీ మాత్రమే వారధిగా మిగిలింది. ఏడో నిజాం హైదరాబాద్‌ను మరోసారి ఇలాంటి భారీ వరదల్ని చూడొద్దని అనుకున్నారాయన. అందుకోసం విశ్వేశ్వరయ్య సేవల్ని వాడుకోవాలనుకున్నారు. వరద రక్షణ వ్యవస్థతో పాటు డ్రైనేజీ వ్యవస్థను రూపొందించేందుకు విశ్వేశ్వరయ్య హైదరాబాద్‌కు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండి పోతాయి. ఆయన సలహా మేరకే గండిపేట్, హిమాయత్‌సాగర్ జంట జలాశయా లను నిర్మించారు. విశాఖపట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడంలో కూడా ఆయన పాత్ర ఉంది. అంతేకాదు...తిరుమల ఏడుకొండలవాడిని చేరుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న భక్తుల వ్యధలను చూసి, శ్రీవారిని చేరుకునేందుకు సులువైన రోడ్డు మార్గానికి సంబంధించిన డిజైన్ రూపొందించిన మహనీయుడు.. కావేరీ నదిపై ఆసియాలోనే అతిపెద్ద డ్యామ్, బీహార్‌లో మొకామా బ్రిడ్జీ, ప్రభుత్వ సబ్బుల ఫ్యాక్టరీ, జోగ్ ఫాల్స్ దగ్గర



హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్, బెంగళూరు–మైసూర్ రైల్ రోడ్డు మార్గం నిర్మాణాల వెనుక విశ్వేశ్వరయ్య ప్రతిభే కారణం. మైసూరు దివానుగా ఉండగా ఆయనకు బ్రిటిషు ప్రభుత్వము "నైట్‌హుడ్" (సర్) బిరుదు ప్రధానం చేసింది. 1955 లో భారత దేశపు అత్యంత గొప్ప పురస్కారం "భారతరత్న" ప్రధానం చేయబడింది. నిండు నూరేళ్లు జీవించిన విశ్వేశ్వరయ్య... 1962 ఏప్రిల్ 14న ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 15 జాతీయ ఇంజినీర్స్ డే జరుపుకొంటున్నాం..

## బోటు మునక ఘటనపై చాలా బాధపడుతున్నాను : మోదీ



**రాజధాని వార్తలు :** ప్రధాని నరేంద్ర మోదీ గోదావరి నదిలో లాంచీ మునకపై స్పందించారు. ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లాలో ఓ బోటు నదిలో మునిగిపోయిందని తెలిసి ఎంతో బాధపడుతున్నానని తెలిపారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విషాద ఘటన జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం సహాయ చర్యలు కొనసాగుతున్నాయని మోదీ ట్వీట్ చేశారు. కాగా, తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం కచ్చులూరు వద్ద జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 12 మంది మృత్యువాత పడ్డారు. పడవలో 61 మంది ఉండగా, అనేకమంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

## గుర్తింపు కోసమే చౌకబారు వ్యాఖ్యలు

**బీజేపీ నేత మాణిక్యాలరావుపై ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ ఫైర్**

**రాజధాని వార్తలు, తాడేపల్లి :** బీజేపీలో గుర్తింపు కోసమే మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం ఆయన తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. తాడేపల్లిగూడెంలో దేవాదాయ భూములను విచ్చలవిడిగా ఆక్రమించుకుని అమ్ముకున్న మాణిక్యాలరావు.. వాటాలు తీసుకోవడం మినహా ఆ శాఖ అభివృద్ధికి చేసింది శూన్యం అన్నారు. దేవాదాయ శాఖ భూములను ప్రజలకు పంపిణీ చేస్తామని ఎక్కడ ప్రభుత్వం చెప్పలేదని స్పష్టం చేశారు. బీజేపీ.. టీడీపీ ఎజెండాను మోస్తుందని బీజేపీ అధికార ప్రతినిధి ఐవైఆర్ కృష్ణారావు చెబుతుంటే.. మాణిక్యాల రావు మాత్రం గుర్తింపు కోసం పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు.

**చోద్యం చూశారే తప్ప.. ప్రశ్నించారా..!**

వైఎస్ జగన్ పరిపాలన దేశానికి ఆదర్శంగా ఉందని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు కితాబునిస్తుంటే.. మాణిక్యాలరావు మతిభ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాజధాని భూములపై చంద్రబాబు నాయుడు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించి ట్రేడింగ్ వ్యవహారానికి తెర లేపితే చోద్యం చూశారే తప్ప.. ప్రశ్నించారా అని నిప్పులు చెరిగారు. జన్మభూమి కమిటీలు, వాలంటీర్ల వ్యవస్థ ఒక్కటేనంటూ అహగాహన లేకుండా మాట్లాడుతున్నారని మాణిక్యాలరావును విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో అందించే వాలంటరీ వ్యవస్థ కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఆక్షేపించారు. అవినీతికి కేరాఫ్ అడ్రసుగా



మారిపోయిన టీడీపీ ఎంపీలను బీజేపీలో సభ్యులుగా చేర్చుకొని రాష్ట్ర ప్రజలకు ఎటువంటి సంకేతాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎరువుల మాఫియాకు, దొంగనోట్లు మార్చే వ్యక్తులకు మాత్రమే మాణిక్యాలరావు న్యాయం చేశారని ఎమ్మెల్యే సత్యనారాయణ ఎద్దేవా చేశారు.

## తాము పర్వతాలు,కాంతమ్మ సేవాట్రస్ట్ -ఎన్ఆర్ఐ హాస్పటల్ వైద్యశిబిరం





**రాజధాని వార్తలు, మంగళగిరి :** తాము పర్వతాలు,కాంతమ్మ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో యన్.ఆర్.ఐ. ఆకాడమీ ఆఫ్ సైన్సెస్, యన్ఆర్ఐ మెడికల్ కాలేజి & జనరల్ హాస్పటల్, చినకాకాని నేత్రవైద్యనిపుణులు, గుంటూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థవారి సహకారముతో ఉచిత కంటి శుక్ల నిర్ధారణ మెగా వైద్యశిబిరము స్థానిక ఎస్.సీ.యం. చైతన్యహైస్కూల్ నందు జరిగినది. వైద్యశిబిరంలో 230 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి యన్.ఆర్.ఐ. హాస్పటల్ నందు ఉచితంగా శుక్లమునకు ఆపరేషన్‌చేసి కళ్ళజోళ్ళు అందజే యబడతాయని నిర్వహకులు (శ్రీతాయి శ్రీనివాసరావు, శ్రీతాయి వంశీకృష్ణ, శ్రీతాయి సుధీర్ కుమార్ మంగళగిరి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు) తెలియజేశారు. ఈ కార్యక్రమానికి శ్రీకె.చక్రవర్తి అడిషనల్ ఎస్.పీ, గుంటూరు రూరల్, శ్రీయం.ఆదిశేష జిల్లాకమీషనర్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్, గుంటూరు, డా॥ టి.యస్.ఆర్. సాయి హోడ్ కమ్యూనిటీ మెడిసిన్ డిపార్టుమెంటు యన్.ఆర్.ఐ. మెడికల్ కాలేజి, చినకాకాని, శ్రీ కె.భగవాన్‌బాబు ఎ.ఓ., యన్.ఆర్.ఐ. హాస్పటల్, డాక్టర్ టి.దివ్య, వైద్యసిబ్బంది, శ్రీమతి డి.ప్రమీల కుమారి సి.ఐ., శ్రీ వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఉయ్యాల సత్యనారాయణ, శ్రీశైలం సత్రం ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ శ్రీ బాలిశెట్టి విజయ్‌కుమార్, శ్రీ అప్పికట్ల శ్రీహరినాయుడు, శ్రీ వై.రాజశేఖర్, శ్రీ యన్. సుబ్బారావుగారు పాల్గొన్నారు. శ్రీ గడ్డం నాగేశ్వరరావు నిర్వహకులను అభినందించారు.

## జనవరిలో కొత్త డీఎస్సీ

**రాజధాని వార్తలు, అమరావతి :** నిరుద్యోగులకు శుభవార్త. జనవరిలో కొత్త డీఎస్సీ–2020 నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ ఏడాది డిసెంబరు 31నాటికి ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను దానిద్వారా భర్తీ చేయనున్నారు. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో రాత పరీక్షలు నిర్వహిస్తారు. జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా కొత్తగా ఎంపికైన టీచర్లకు నియామక ఉత్తర్వులు అందిస్తారు. ఇకపై ప్రతి సంవత్సరం ఇదే పద్ధతిలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏటా జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చి వేసవి సెలవుల్లోగా టీచర్ల నియామకాలు పూర్తిచేస్తే విద్యార్థులకు మెరుగైన బోధన లభిస్తుందని, దీనిద్వారా సర్కారీ స్కూళ్లలో అడ్మిషన్లు పెరుగుతాయని భావిస్తున్నారు. అలాగే విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి పాటించే అంశాన్ని కూడా సర్కారు పరిశీలిస్తున్నట్లు సమాచారం. విద్యాహక్కు చట్టం ప్రకారం.. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 30మందికి ఒకరు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో ప్రతి 35మంది విద్యార్థులకు ఒకరు చొప్పున టీచర్ ఉండాలి. అయితే పాఠశాలల్లో ఉండే తరగతులు, సెక్షన్లను బట్టి అదనపు టీచర్ల అవసరం ఉంటుంది. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా ఉపాధ్యాయులను ఉంచడానికి కసరత్తు చేస్తున్నామని పాఠశాల అధికారులు చెబుతుండగా.. విద్యాశాఖపై తాజాగా జరిగిన సమీక్ష సందర్భంగా ఉపాధ్యాయ ఖాళీల భర్తీ ప్రక్రియను ఏటా జనవరి నుంచి ప్రారంభించాలని సీఎం జగన్ ఆదేశించారు. డీఎస్సీ–2018 నోటిఫికేషన్ జారీచేసే నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్ పాఠశాలల్లో దాదాపు 20వేల వరకు ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. అప్పట్లో ప్రభుత్వం సుమారు 6వేల పోస్టులనే నోటిఫై చేయగా, దాదాపు 14వేల ఖాళీలు ఉన్నాయి. అప్పటినుంచి ఈ ఏడాది డిసెంబరు వరకు రిటైర్మెంట్లు, పదోన్నతులు తదితర కారణాలతో ఈ సంఖ్య 25వేల వరకు పెరుగుతుందని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, ఈ నెలాఖరులో రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మోడల్ స్కూళ్లకు సుమారు 3వేల మంది కొత్త టీచర్లు రానున్నారు. డీఎస్సీ–2018 నోటిఫికేషన్ ద్వారా 7,902 పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం భావించినా విద్యార్హతలు, సర్వీసు పరమైన అంశాలకు సంబంధించి న్యాయపరమైన సమస్యలు ప్రతిబంధకంగా మారాయి. ఒకవైపు కోర్టు ఆదేశాలు, మరోవైపు నిరుద్యోగుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో వివాదాల్లేని పోస్టులను తొలివిడతలో భర్తీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే దాదాపు 1,900మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. సదరు జాబితాలోని కొందరని వేర్వేరు కారణాలతో తిరస్కరించారు. వారిస్థానంలో ప్రొవిజినల్ మెరిట్ లిస్టులో ఉన్న తదుపరి అభ్యర్థులను వెరిఫికేషన్‌కు ఆహ్వానిస్తున్నారు.

## ఏపీ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు : రోజా



**రాజధాని వార్తలు, తిరుమల :** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ నేత, ఏపీఐఐసీ చైర్మన్ ఆర్కే రోజా అన్నారు. శనివారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ఆమె దర్శించుకున్నారు. సీఎం జగన్ సుపరిపాలనను ఓర్వలేకే చంద్రబాబునాయుడు పెయిడ్ ఆర్టిస్ట్‌లతో డ్రామాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. యరపతినేని, కోడెల వంటి కీచకుల నుంచి విముక్తి పొందామని పల్నాడు ప్రజలు ఆనందంగా వున్నారన్నారు. కోడెల, యరపతినేని, దేవినేని ఉమా, అచ్చెంనాయుడు, బోండా ఉమా బాధితుల కోసం చంద్రబాబు పునరావాస కేంద్రాలు ఎందుకు పెట్టలేదని రోజా ప్రశ్నించారు.

## 18 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన ఏపీ ప్రభుత్వం



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. 18 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారి వివరాలు.. అజయ్ జైన్– హౌజింగ్ ముఖ్య కార్యదర్శి.. శాంతిలాల్ దండే– పరిశ్రమలు, పెట్టుబడులు శాఖ కార్యదర్శి.. సిద్ధార్థ జైన్– స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్, ఐజీ.. భాను ప్రకాష్– గిడ్డంగులు కార్పొరేషన్ వీసీఎండీ.. పి.ఉషాకుమారి– ఆయుష్ కుమార్, పి.ఎ.శోభ– గిరిజన సహకార సంస్థ వీసీఎండీ.. టి. బాబురావు నాయుడు– పునరావాస ప్రత్యేక కమిషనర్.. కె.శారదాదేవి– మైనార్టీ సంక్షేమశాఖ ప్రత్యేక కమిషనర్.. జి. రేఖా రాణి– కార్మిక శాఖ ప్రత్యేక కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

చెరుకూరి శ్రీధర్– ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ సెక్రటరీ.. ఎల్.ఎస్ బాలాజీ– మర్క్‌ఫెడ్, అగ్రోస్ ఎండీ.. ఎంఎ కిషోర్– కమిషనర్, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్.. నందకిషోర్– ఎంగీ ఏపీటీఎస్.. డి. వాసుదేవ రెడ్డి– ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ వీసీఎండీ.. వి. రామకృష్ణ– స్పెషల్ కమిషనర్.. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్.. ఎన్. చంద్రమోహన్ రెడ్డి– ఏపీ యుఎఫ్ఐడీసీ ఎండీ శాఖలకు బదిలీ చేశారు. కాగా జి. అనంతరామును సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ)కు రిపోర్టు చేయాలని ఆదేశించారు.

## 'చంద్రబాబు పెయిడ్ ఆర్టిస్టులా పవన్'

**రాజధాని వార్తలు, అమరావతి :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంద రోజుల పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసేలా సీఎం జగన్ పాలన సాగుతుందన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అవినీతిపరులకు వత్తాసు పలికేలా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

జనసేన పార్టీ ఇచ్చిన నివేదిక చూస్తుంటే పవన్ కల్యాణ్, చంద్రబాబు కలిసి కూర్చొని రాసినట్లుగా ఉందని విమర్శించారు.



పవన్ మేనిఫెస్టో 22 పేజీలు ఉంటే.. ఆయన సీఎం జగన్ పాలనపై ఇచ్చిన నివేదిక 33 పేజీలు ఉందని ఎద్దేవా చేశారు. తాము 100 ఏళ్లు పరిపాలన చేసినా చంద్రబాబు, పవన్ తమకు మంచి సర్టిఫికేట్ ఇవ్వరని తెలిపారు. చంద్రబాబు పెయిడ్ ఆర్టిస్టులా పవన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎవరినో ఓడించడానికే జనసేన పార్టీ పుట్టింది కానీ సొంతంగా అధికారంలోకి రావడానికి కాదన్నారు. జనసేన స్వయం ప్రకాశక పార్టీ కాదని, వేరే వారి ప్రకాశం కోసం మాత్రమే పని చేస్తుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అక్రమ కట్టడాలపై పవన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సీఎం జగన్‌కు చంద్రబాబు, పవన్‌ల సర్టిఫికేట్ అవసరం లేదని, ప్రజల సర్టిఫికేట్ ఉంటే చాలన్నారు. అవినీతిరహిత పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని అంబటి పేర్కొన్నారు.

# గుజరాత్ కసాయికి అవార్డా ?



**మానవహక్కుల కార్యకర్తల ఆగ్రహం**

**న్యూఢిల్లీ :** బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ ప్రధాని మోడీకి గ్లోబల్ గోల్‌కీపర్ అవార్డు ప్రకటించడంపై మానవహక్కుల కార్యకర్తలు మండిపడ్డారు. 'గుజరాత్ కసాయి'కి అవార్డు ఎలా ప్రకటించారని లాయర్లు, రాజకీయ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. స్వచ్ఛభారత్ అభియాన్ కోసం బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ ఈ అవార్డును ప్రకటించినట్లు ప్రధాని కార్యాలయం నుంచి జితేంద్ర సింగ్ ప్రకటించిన విషయం తెలిసిందే. గుజరాత్ కసాయి, తూర్పుప్రాంత హిట్లర్‌గా వారంతా ఆయనను పిలిచారు. గేట్స్ ఫౌండేషన్ ఈ అవార్డుకు మోడీకి ఇవ్వడానికి వీలులేదని వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. అతనిపై హిందూవాదిగా ముద్ర ఉందని, మైనార్టీలకు వ్యతిరేకంగా ఆయన హింసను ప్రేరేపిస్తున్నాడని, భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకుంటున్నారని ఇద్దరు లాయర్లు సుచిత్ర విజయన్, అర్జున్ సింగ్‌లు న్యూయార్క్ టైమ్స్‌లో ఆర్టికల్‌ను ప్రచురించారు. నెల నుంచి కాశ్మీర్, అసోంలో మోడీ అణచివేత చర్యలు చేపట్టారని అతనికి ఎటువంటి అవార్డు ఇవ్వనక్కర్లేదని రచయితలు కోరారు. గేట్స్ ఫౌండేషన్ తన హోంపేజీలో అన్ని జీవితాలకు ఒకే విలువ ఉంటుందని, మోడీకి అవార్డు అందచేయడం ఆయన పాలనలో హింసలు అనుభవించిన వారిని వంచించినట్లే అని పేర్కొంది.

**ఆన్‌లైన్‌లో కార్యకర్తల నిరసన**

పత్రికల్లో ప్రచురించిన ఆర్టికల్ ఆన్‌లైన్ వైరల్ అయ్యింది. దీనిని మానవహక్కుల కార్యకర్తలు, అంతర్జాతీయన విధాన నిపుణులు, రాజకీయ నాయకులు షేర్ చేసుకున్నారు.

**న్యూయార్క్ మానవహక్కుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, పరిశీలకురాలు కెన్నత్ రూత్**

మాట్లాడుతూ గేట్స్ ఫౌండేషన్ ఎందుకు భారత ప్రధానికి అవార్డు ఇవ్వాలనుకుంది ? బహిరంగ విసర్జనకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిన ఆయన కాశ్మీర్‌లో ముస్లింల అణచివేతకు, అసోంలో అనేకమంది పౌరసత్వాన్ని కోల్పోటానికి కారణమయ్యాడు. అంతేకాదు దేశవ్యాప్తంగా హింసను వ్యాపింప చేస్తున్నారు.

**కవిత ఎనరామదాస్**

ప్రపంచ గుర్తింపు పొందిన లింగ సమానత్వ న్యాయనిపుణురాలు కవిత ఎనరామదాస్ మాట్లాడుతూ అధికారం, మెజారిటిజం, మూఢత్వం పెంచి పోషిస్తున్న నాయకత్వానికి అవార్డు ప్రకటించరాదని ట్వీట్‌చేశారు.

**అంతర్జాతీయ మానవ హక్కుల లాయర్ ఆర్సాలన్ ఇఫ్తికర్**

'మీకు తెలుసా నరేంద్రమోడీకి 2005 నుంచి 2014 వరకు అమెరికా వీసా నిలుపు చేసింది. ఎందుకంటే అతడు గుజరాత కసాయి సీఎంగా ఉండగా 2000 మంది ముస్లింలను చంపాడు అని ట్వీట్ చేశారు.

**నౌరా ఎరాకట్**

మానవహక్కుల కార్యకర్త, వాషింగ్టన్ పాలసీ కార్యకర్త విద్యారూపకల్పన విధాన రూపశిల్పి నౌరా ఎరాకట్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో హింసను ప్రజ్వరిల్ల చేసి వారిని ఆయా ఘటనలకు బాధ్యులిగా చేయాలిగాని అవార్డులు ఇవ్వకూడదన్నారు.

**అంతర్జాతీయంగా అసమానతలు పెంచుతున్నందుకు అవార్డా ?**

కుల,మత,ప్రాంతాలవారిగా అసమానతలు పెంచుతున్న మోడీకి అవార్డు ప్రకటించడమే మిటని నెటిజన్లు దుమ్మెత్తి పోశారు.

మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిలియనీర్, వితరణశీల జంట బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్‌ను నెలకొల్పారు. దీనిద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అనారోగ్యం,ఆకలి, పేదరికం నుంచి కాపాడటానికి నిధులను వినియో గిస్తున్నారు. ఈ ఏడాది మోడీకి గ్లోబల్ గోల్‌కీపర్ అవార్డు ప్రకటిస్తే వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్లేనని, తద్వారా వారు దేశంలోనూ, అంతర్జాతీయంగా సమర్థవంతంగా పనిచేయగలరని పీటీఐ వర్గాలు తెలిపాయి. గ్లోబల్ గోల్ అవార్డుల నాలుగో ఏడాదిలో అంతర్జాతీయంగా అసమానతలు తగ్గించే వారిని ఈ అవార్డును అందచేస్తామని గేట్ ఫౌండేషన్ వెబ్‌సైట్ తెలిపింది.

**ఆ అవార్డును తిరస్కరించు : ఆర్ఎస్ఎస్**

సంఘపరివార్ నుంచి మోడీకి ఒక ఆయాచిత అందింది దాని సారాంశమేమిటంటే ఆ అవార్డును తీసుకోకపోవడమే మంచిదని వారు సలహా ఇచ్చారు. స్వదేశీ జాగరణ మంచ్ ఆర్ఎస్ఎస్ గ్రూపులు మాత్రం అవార్డు అందుకోవడంపై పునరాలోచన చేయాలన్నారు. వాస్తవానికి బీఎంజీఎఫ్ వితరణ సంస్థ కాదని, ఆపేరుతో వ్యాపారం నిర్వహిస్తూ చట్టవ్యతిరేక, అనైతిక క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తుందని స్వదేశీ జాగరణ్ మంచ్ కో కన్వీనర్ అశ్వని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



రాజధాని వార్తలు, అమరావతి : ఎఛీవర్స్- బాబ్ కబ్ల్ ఆధ్వర్యంలో విజయవాడలో సహ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న అమీత్ జిందల్. ఈ సమావేశంలో వివిధ కంపెనీల ప్రతినిధులు తమ వ్యాపారాలను గురించి వివరించారు.

## ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మౌలిక వైద్య సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్‌గా ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సొంత ఊరు వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరు. న్యూరో ఫిజీషియన్‌గా మంచి గుర్తింపు ఉన్న ఆయన ఇటీవల ప్రభుత్వం ఆరోగ్యశాఖలో సంస్కరణల కోసం నియమించిన నిపుణుల కమిటీలో సభ్యులుగా ఉన్నారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయన ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు.

## జస్టిస్ శివశంకరరావు బాధ్యతల స్వీకరణ



**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. శివశంకరరావు అన్నారు. టెండర్ల ప్రక్రియ న్యాయ పరిశీలన కమిటీ చైర్మన్‌గా శనివారం సచివాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టెండర్ల విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మౌలిక సదుపాయాల (న్యాయ పరిశీలన ద్వారా పారదర్శకత) చట్టాన్ని తెచ్చి, దీన్ని అమలు చేయడానికి ఒక న్యాయమూర్తిని నియమించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. విదేశాల్లో కూడా ఈ తరహా విధానం ఎక్కడా లేదని వెల్లడించారు. లోకకల్యాణం కోసం మనమంతా జీవించాలని, ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కోరారు. హక్కుల కోసం పోరాడేవారు బాధ్యతగా ఉండాలని.. కర్మబద్దంగా.. ధర్మబద్దంగా అందరూ పని చేయాలని ఆయన అన్నారు. బాధ్యతలు చేపట్టడానికి ముందు తాడేపల్లి కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జస్టిస్ శివశంకరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

## కృత్రిమ మేధస్సు-సెమినార్






**రాజధాని వార్తలు, విజయవాడ :** ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆచార్యుడు కె.సుబ్బారావు పేర్కొన్నారు. ఎంజీరోడ్డులోని వి మీడియా హౌస్‌లో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డిప్ లెర్నింగ్ అనే అంశంపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యా, వైద్యం, వ్యవసాయ, ఆటోమొబైల్‌తో పాటు వివిధ రంగాల్లో కృత్రిమ మేదస్సు అనుసంధానం అవుతుందన్నారు. ఆచార్య శంకర్ (బెంగుళూరు), సివిల్ ఇంజినీర్ రవికాంత్ యోగా, నిర్మాణ రంగంలో కృత్రిమ మేదస్సు అనుసంధానం గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జునశర్మ, రాజధాని వార్తలు ఎడిటర్ హుస్సేన్ ఖాన్, స్పాన్ ఎడ్వర్‌టైజింగ్ ఏజెన్సీ ఇన్‌చార్జ్ రాఘవరావు, సిద్ధార్థ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## "తర్పయామి" సినిమా షూటింగ్






**రాజధాని వార్తలు, మంగళగిరి :** మంగళగిరి లోని హేపీ రిసార్ట్స్‌లో "తర్పయామి" సినిమా షూటింగ్ ఆరంభమైంది. ముహూర్తపు షాట్ కార్యక్రమంలో సమాచార శాఖ మంత్రి పేర్ని నాని పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లో కూడా సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందాలని ఆశించారు. ఇంకా ఈ కార్యక్రమంలో నిర్మాతలు శివలంక ప్రసాద్, అంబటి మధు మోహన్ కృష్ణ, దర్శకుడు మధు అంబట్ ,హీరోయిన్ ఆధ్య కృష్ణ, సంగీత దర్శకుడు ఇస్సాక్,తదితరులు పాల్గొన్నారు. అవయవదానం ఇతివృత్తం పై తీస్తున్న ఈ చిత్రం మరో "శంకరాభరణం " కాగలదన్న ఆశాభావం ను దర్శకుడు మధు అంబట్ వ్యక్తం చేశారు.






పద్మశ్రీ వేదాంత సత్యనారాయణ వర్మ జయంతి సందర్భంగా సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమి వారు విజయవాడలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన

## 'సర్ సయ్యద్ డే' సెప్టెంబర్ సందర్భంగా

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ బహాదుర్ :(అక్టోబరు 17, 1817- మార్చి 27, 1898), పరిచయమైన పేరు సర్ సయ్యద్, భారతీయ విద్యావేత్త, రాజకీయ నాయకుడు,




ఇస్లామీయ సామాజిక సంస్కర్త, నవీన భావాలు గలవాడు. ముస్లిం సమాజంలో విద్యావ్యాప్తి కొరకు అహర్నిశలూ కఠోరంగా కృషిచేసిన ఘనుడు. మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీని స్థాపించి దాన్నే అంచెలంచెలుగా అలీఘర్ ముస్లిం యూనివర్శిటీగా తీర్చిదిద్దిన ధీశాలి. ఇతడి దూరదృష్టి మూలంగానే ముస్లిం సమాజంలో విద్యాపరంగానూ రాజకీయంగానూ ఎదుగుదలకు ఓ వేదిక ఏర్పాటైంది.

## 'జగనన్న విజయంలో మీరు భాగస్వాములయ్యారు'



**రాజధాని వార్తలు, కువైట్ :** వైఎస్ షర్మిల కువైట్ పర్యటనలో భాగంగా జోసెఫ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'జీవము గల దేవుడు' 8వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆదివారం తన భర్త బ్రదర్ అనిల్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కువైట్ కమిటీ సభ్యులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. జగనన్నను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చూడాలని పార్టీ అభ్యర్థుల విజయంలో వారు భాగస్వాములు అయినందుకు తమ కుటుంబ సభ్యుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్, కువైట్ కన్వీనర్లు ఇలియాస్, బి.హెచ్. ముమ్మడి బాలిరెడ్డి, ఇతర వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీ విజయసాయిరెడ్డికి ఢిల్లీలో కీలక పదవి...



**ఢిల్లీ :** పార్లమెంటరీ స్థాయి సంఘాలను స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. శనివారం ఉదయం లోక్‌సభ స్పీకర్ అధికారికంగా ప్రకటించారు. వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్‌గా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిని నియమించారు. ఈ కీలక పదవి విజయసాయికి వరించడంపై వైసీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఈ కమిటీలో మాగుంట శ్రీనివాసులురెడ్డి, నామా, కేశినేని నానిని సభ్యులుగా నియమిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం చైర్మన్‌గా కేకేను, పరిశ్రమల వ్యవహారాల పార్లమెంటరీ సభ్యుడిగా అవినాష్ రెడ్డిని నియమిస్తున్నట్లు ఓం బిర్లా తెలిపారు. ఇదిలా ఉంటే.. రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖల స్థాయి సంఘం చైర్మన్‌గా టీజీ, పార్లమెంట్ వ్యవహారాల ఆర్థికశాఖ సభ్యులుగా మిథున్‌రెడ్డి, సీఎం రమేష్‌ను నియమిస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. మొత్తానికి చేస్తే తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఢిల్లీలో కీలక పదవులు వరించడం విశేషం.

## కులాంతర వివాహాలు- సామాజిక సంఘర్షణలు







**రాజధాని వార్తలు,** కులాంతర వివాహాలు- సామాజిక సంఘర్షణలు అనే వ్యాస సంకలనాన్ని అమృత వర్షిణి ఆవిష్కరించింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని మానవ వికాస మండలి వ్యవస్థాపకుడు రేకా కృష్ణార్జునరావు సంకలనకర్తగా ఈ పుస్తకాన్ని వెలువరించారు.


## రాజధాని క్లాసిఫైడ్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్‌ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

రాయపూడి
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు, పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

రాయపూడి
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హెూమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్ రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె.గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ :90329 58580

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

ఐనవోలు
విఐటీ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్‌యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ ట్రైలర్స్)
ఫోన్ : 9959308664

నూతక్కి
కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్ నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

వెలగపూడి
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగాని కిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లుఅమ్మబడును.
ఫోన్ : 9640811333

మంగళగిరి,
అరుణోదయ హెచ్.పి. గ్యాస్‌ఏజన్సీ హుస్సేన్ కట్ట వద్ద, 9848111905

**సాగర్ బోర్ వెల్స్**
సరసమైన ధరలకు మీరు మెచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీర్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683,

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
ఫోన్ : 7893187172

విజయవాడ
న్యూఫేస్ కినిక్, డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విజయవాడ
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం లిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి
9440662699

http://rajadhanivartalu.com





Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com